క్లుప్తంగా

పరిహారం పంపిణీ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ అనూష ఆధ్వర్యంలో రైల్వే అధికారులు, భూ సేకరణ బృందం సమక్షంలో మనుబోలు ఎల్‌సీ గేట్ నంబర్ 102 వద్ద భూ సేకరణకు సంబంధించిన పరిహారం పంపిణీ చేశారు. తొలుత అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

రూరల్ ఎంపీడీఓగా రమణమ్మ



నెల్లూరు సిటీ: ఎంపీడీఓగా వి.రమణమ్మ నెల్లూరు రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ప్రకాశం జిల్లాలో డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై నెల్లూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బహుమతుల ప్రదానం



నెల్లూరు(టౌన్): స్వచ్ఛతా హీ సేవలో భాగంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డీఐఓ సురేష్, సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు, మహేంద్రరెడ్డి ఉదయ్‌శంకర్‌రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులు



నెల్లూరు(అర్బన్): జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని అక్టోబర్ 1న కాకుండా 5వ తేదీ జరుపుకొనేందుకు అనుమతించాలని రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ అయిన కలెక్టర్ హిమాన్షు శుక్లాను రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులు కోరారు. మంగళవారం బ్లడ్‌బ్యాంక్ అడ్వైజర్ మలిరెడ్డి కోటారెడ్డి, కన్వీనర్ సీహెచ్ అజయ్‌బాబు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ యశోవర్ధన్ తదితరులు కలెక్టరేట్‌లో ఆయన్ను కలిశారు. బ్లడ్‌బ్యాంక్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కోటారెడ్డి వివరించారు. జాతీయ రక్తదాన దినోత్సవం కార్యక్రమానికి రావాలని ఆహ్వానించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

ఆర్వో, ఆర్‌ఐలకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ ఇద్దరు రెవెన్యూ అధికారులు, పదిమంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు కమిషనర్ నందన్ మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి అన్ కలెక్టబుల్ డిమాండ్ ప్రఫార్మా (ఆస్తిపన్నులు వసూళ్లు చేయుటకు వీలు పడని జాబితా)ను సమర్పించడంలో ఆలస్యం చేయడానికి గల కారణాలను వివరించాలని నోటీసు ద్వారా తెలియజేశారు. అదేవిధంగా సమర్పించిన నివేదికలో కలెక్ట్ అయిన అసెస్‌మెంట్ నంబర్లను కూడా ఎందుకు జత చేశారనే వివరణను కమిషనర్ కోరారు. ఉన్నతాధికారులకు తప్పులతో కూడిన నివేదికను ఎందుకు సమర్పించారో వివరించాలని ఆదేశించారు. ఆయా కారణాలపై మూడు రోజుల్లోపు జవాబు ఇవ్వని పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నారాయణ ప్లేస్‌మెంట్స్‌లో 40 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

నెల్లూరు(టౌన్): స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ఐఫిల్ టెక్ సొల్యూషన్స్ కంపెనీ నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో 40 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మేనేజ్‌మెంట్ సెక్రటరీ వినయ్‌కుమార్ తెలిపారు. వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఎంపికైన వారికి శిక్షణ అనంతరం ఏడాదికి రూ.2.40 లక్షల నుంచి వేతనం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి సందీప్‌రెడ్డి, డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, విశ్వక్‌సేనరెడ్డి, సంస్థ హెచ్‌ఆర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



మహావిష్ణు మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ధనలక్ష్మి అలంకరణ



శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయంలో గాయత్రీదేవి అలంకరణ



సీతారామస్వామి మందిరంలో బాలాత్రిపురసుందరీదేవి



మహాలక్ష్మి ఆలయంలో భవానీ అలంకారం



వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో బాలాత్రిపురసుందరీదేవి



కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కుబేర అలంకారం



ధాన్యలక్ష్మి అలంకరణలో..

శక్తి స్వరూపిణీ.. శరణు శరణు

- వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నగరంలోని ఆలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం అమ్మవారు భవాని అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా మాగుంట సోదరులు, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, సరిత, తోట దామోదర్, శోభారాణి వ్యవహరించారు.

➡ స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో భవానీ అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. మూలవర్లకు కుబేర అలంకారం నిర్వహించారు. శ్రీప్రసన్న ఆంజనేయ కోలాట మండలిచే కోలాటం, శ్రీరామనాథ సంగీత విద్యాలయ విద్యార్థులచే గానలహరి జరిగింది. ఉభయకర్తలుగా కొలిపాకుల సురేష్‌బాబు, సుహారిక, కొలిపాకుల వరలక్ష్మమ్మ వ్యవహరించారు.

➡ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు భవానీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఎనమలమంద శ్రీనివాసులు, లక్ష్మి దంపతులు వ్యవహరించారు.

➡ సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పి.చంద్రశేఖర్ ఆచారి, ఎం.సాయికుమార్, ఎం.ప్రసన్నకుమార్ వ్యవహరించారు.



శేషవాహనంపై లక్ష్మీనారాయణ అలంకరణలో వెంకటేశ్వరస్వామి

➡ సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు భవానీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా శింగంశెట్టి మహేంద్ర, భార్గవి దంపతులు వ్యవహరించారు.

➡ ఏసీ నగర్ కోదండరామపురం మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు భవానీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా జె.బాలవెంకట అశోక్, అనూరాధ, వి.బాబు, శేషమ్మ, ఎస్.సుబ్బారావు, సౌభాగ్యవతి, కె.వెంకటరమణ, ఉమ, ఎస్.వెంకటనారాయణ, కామాక్షి వ్యవహరించారు.

➡ మెక్లిన్స్‌రోడ్డు విరాట్‌నగర్‌లోని గాయత్రీదేవి, విశ్వకర్మ భగవాన్ స్వామి, గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గాయత్రీదేవి, గోవిందమాంబల శరన్నవరాత్రి మహోత్సవాలు విశేషంగా నిర్వహిస్తున్నారు. బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పి.ఈశ్వరయ్య ఆచారి, కుసుమ, వి.వరప్రసాద్ ఆచారి, రత్నమ్మ వ్యవహరించారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. ధనలక్ష్మి హోమం, శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం, కుంకుమపూజ, అష్టలక్ష్మి వైభవం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఘంటసాల రేవతి కుమార్, ఉషారాణి దంపతులు వ్యవహరించారు.

➡ నవాబుపేటలోని శ్రీమత్ ద్రౌపతీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజ స్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా వేలూరు అశోక్, కామాక్షి, వేలూరు లోక్‌నాథ్, లక్ష్మీప్రీతి, వేలూరు మనోహర్ వ్యవహరించారు.

➡ మూలాపేటలోని శ్రీమత్ ద్రౌపతీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజ స్వామి లయంలో మహాలక్ష్మిఅలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఆరంబాకం కృష్ణసింహ సోదరులు వ్యవహరించారు.

ధాన్యలక్ష్మి అలంకరణలో..

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ పరిధిలోని నరసింహకొండపై ఉన్న లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో మంగళవారం ఆదిలక్ష్మి అమ్మవారు ధాన్యలక్ష్మిగా విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు మాధవగిరి భాస్కరాచార్యులు, అర్చకులు మాధవగిరి వెంకట అప్పలాచార్యులు కలశపూజ, విశేష కుంకుమార్చన నిర్వహించారు.

➡ నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీనారాయణ అలంకారంలో శేషవాహనంపై ఆశీనులై భక్తులకు స్వామి దర్శనమిచ్చారు. అనంతరం శ్రీగోకుల కోటాట బృందం ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలకు కెనడా దేశంలో స్థిరపడిన సంగరాజు సుధీర్, భావన దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

డీకేడబ్ల్యూలో విద్యార్థులకు అవగాహన

నెల్లూరు(టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మంగళవారం మెడికల్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బెయిన్ స్ట్రోక్ తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యూరాలజిస్టు డా.బిందు మీనన్ విచ్చేసి బ్రెయిన్ స్ట్రోక్ ప్రారంభ లక్షణాలు, గుర్తించడం ఎలా, తక్షణ చర్యలు తదితర వాటిని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రమణారావు, కమిటీ కో–ఆర్డినేటర్ రంజని, అధ్యాపకులు రమాదేవి, స్వాతి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ్ మాసోత్సవాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురం అంబేడ్కర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రత్నమ్మ మాట్లాడుతూ మాసోత్సవాలు అక్టోబర్ 16వ తేదీ వరకు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ ఆఫ్రిన్, సుభాషిణి, రజిని, సునీత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన కోసమే పీ4

నెల్లూరు(బారకాసు): పేదరిక నిర్మూలన కోసమే పీ4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని కమిషనర్ వైఓ నందన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ సూచనల మేరకు స్వర్ణాంధ్ర విజన్ – 2047లో భాగంగా జీరో పావర్టీ పీ4 శిక్షణా కార్యక్రమాన్ని వార్డు సచివాలయ కార్యదర్శులకు కస్తూర్బా కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ జి.మాధురి, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఎంపీడీఓ శైలేంద్ర కుమార్, ఏఎస్‌ఓ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగేందుకు నగదు ఇవ్వలేదని..

- ఆటోని తగులబెట్టిన కేసులో ఇద్దరి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగేందుకు నగదు ఇవ్వలేదన్న అక్కసుతో ఆటోను తగులబెట్టిన ఘటనలో ఇద్దరు నిందితులను మంగళవారం నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. మౌలానా సాహెబ్ వీధిలో ఆటో డ్రైవర్ వినయ్ నివాసముంటున్నాడు. ఈనెల 21వ తేదీ రాత్రి వినయ్‌ను మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని నెల్లూరు రూరల్ మండలం సుబహాన్‌నగర్‌కు చెందిన డేవిడ్, శెట్టిగుంటరోడ్డుకు చెందిన సతీష్ అడిగారు. అతను లేవని చెప్పడంతో వారు కోపం పెంచుకున్నారు. 22వ తేదీ తెల్లవారుజామున వినయ్ ఆటోపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. బాధితుడు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం నిందితులను అరెస్ట్ చేశారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

డయల్ యువర్ డీఎం-1 నేడు

నెల్లూరు సిటీ: నెల్లూరు డిపో–1 పరిధిలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ జి.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు చెప్పాలన్నారు. సాయంత్రం 4 నుంచి 5గంటల మధ్యలో 99592 25641 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

టీకాలు వేయించండి

నెల్లూరు(పొగతోట): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.రమేష్ నాయక్, డీడీ డాక్టర్ టి.సోమయ్య కోరారు. మంగళవారం నగరంలోని మన్సూర్ నగర్‌లో పశువులకు టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు 1.12 లక్షల పశువులకు టీకాలు వేశామని తెలిపారు.

కలెక్టర్‌కు వినతి



నెల్లూరు రూరల్: సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ ఆధ్వర్యంలో పలువురు కలెక్టర్ హిమాన్షు శుక్లాకు విన్నవించారు. మంగళవారం ఆయన్ను కార్యాలయంలో కలిసి మాట్లాడారు. ఐటీడీఏ కార్యాలయంలో ఎరుకల వారికి తగిన ప్రాధాన్యం, గుర్తింపు ఇవ్వడం లేదని, చిన్నచూపు చూస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో నల్లగొండ్ల సుజన, కట్టా రమణయ్య, వెంకయ్య, సంజయ్ పాల్గొన్నారు.

విజయమ్మ ఆత్మహత్యాయత్నం బాధాకరం



విజయమ్మను పరామర్శిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

- ఇది సోమిరెడ్డి అరాచకాలకు పరాకాష్ట
- కేసును నీరుగారిస్తే పోలీసులకు ఇబ్బందులు తప్పవు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మండలం దొరువులపాళెం గ్రామానికి చెందిన విజయమ్మ ఆత్మహత్యాయత్నం బాధాకరమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయమ్మను మంగళవారం రాత్రి గోవర్ధన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాన్ని తట్టుకోలేక విజయమ్మ భర్త మృతిచెందాడన్నారు. దీంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్రలో ఆమె ఇంటికెళ్లి పరామర్శించినట్లు చెప్పారు. అప్పటి నుంచి ఆ దళిత కుటుంబానికి చెందిన విజయమ్మ వైఎస్సార్‌సీపీపై అభిమానంతో కార్యకర్తగా ఉందన్నారు. దొరువులపాళెనికి చెందిన సునీత వీఓఏగా పనిచేస్తూ పొదుపు మహిళలకు చెందిన రూ.18 లక్షలు స్వాహా చేసిందన్నారు. ఈ విషయాన్ని విజయమ్మ వెలుగులోకి తీసుకొచ్చి కలెక్టర్, అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. విచారించిన అధికారులు ఆమెను వీఓఏగా తొలగించారన్నారు. ఖాళీగా ఉన్న ఆ పోస్టులో విజయమ్మ కోడలు కోటేశ్వరమ్మను నియమించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ విచారణ చేయగా సునీత నిధుల దుర్వినియోగం చేసిందని మరోసారి నిరూపితమైందన్నారు. అయినా కూడా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారుల ద్వారా వీఓఏను తొలగించారన్నారు. నిధులు స్వాహా చేసిన వారిని మళ్లీ ఆ పోస్టులో నియమించుకున్నారన్నారు. దీనిని ప్రశ్నించినందుకు టీడీపీ నేతలు విజయమ్మను టార్గెట్ చేశారన్నారు. ఆమె సెల్ఫీ వీడియో తీసుకుని నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. పోలీసులు ఈ కేసును నీరు గారిస్తే సహించేది లేదన్నారు. వీడియో సాక్ష్యంగా ఉందన్నారు. భవిష్యత్‌లో పోలీసులు ఇబ్బందులు పడుతారన్నారు. తాము కూడా వారిపై ప్రైవేట్ కేసులు వేస్తామని హెచ్చరించారు. సోమిరెడ్డి ఎమ్మెల్యే అయ్యాక వీఓఏలు, డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను వేధించడం, సర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేయిస్తూ ఇబ్బందులు పెడుతున్నాడన్నారు. అక్రమాలను అడ్డుకుని తీరతామన్నారు. ఆమె కుటుంబానికి అండగా ఉండి కాపాడుకుంటామన్నారు. బాధితురాలి కోడలు కోటేశ్వరమ్మ మాట్లాడుతూ తమ కుటుంబంపై విక్రమ్‌రెడ్డి అనే వ్యక్తి పగబట్టాడని ఆయన సోమిరెడ్డి ఒక్కటై వేధిస్తున్నారని ఆవేదన చెందారు. పొదుపులో తినేసిన డబ్బులు గురించి ప్రశ్నించడమే నేరమైందని, అందుకే తమను హింసిస్తున్నారన్నారు.

వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు

- కమిషనర్ వైఓ నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని డ్రెయిన్లలో వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ సూచించారు. మంగళవారం 29వ డివిజన్ మహాత్మా గాంధీ నగర్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణ ఆశించిన స్థాయిలో లేదని కమిషనర్ శానిటేషన్ విభాగం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన భవనాల కొలతలను తనిఖీ చేసి అసెస్మెంట్ డిమాండ్లను పరిశీలించారు. అనంతరం కొండ్లపూడి ప్రాంతంలోని టిడ్కో గృహాల ప్రాంగణం, హౌసింగ్ లేఅవుట్ ప్రాంతాలను నందన్ పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ షేక్ సత్తార్, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

➡ స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ నెల్లూరును తీర్చిదిద్దాలంటే అందరూ చెత్తను వేరుచేసి మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందించాలని కమిషనర్ నందన్ అన్నారు. మంగళవారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కార్పొరేషన్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, ఎమినిటీస్ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలకు ఒకరోజు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులను నిర్వహించారు. ఏడబ్ల్యూఐఎల్ఎస్‌జీ నుంచి రాజేష్, సాయికృష్ణ, పీఎంయూ టీం పాల్గొన్నారు. ఆర్పీలుగా డాక్టర్ శ్రీనివాస్, రమాదేవి వ్యవహరించారు.



పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

హామీలు నెరవేర్చాలని డిమాండ్

నెల్లూరు(అర్బన్): ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలంటూ మంగళవారం ఆ సంఘం నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మున్నా మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వాలన్నారు. అమరావతి రాజధాన్ని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు 70 శాతం ఉద్యోగాలు కల్పించాలని కోరారు. పేద నిరుద్యోగ యువతకు స్టడీ సర్కిళ్లను అందుబాటులోకి తెచ్చి ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గౌస్‌బాషా, సర్దార్ మీరా, వాసుదేవరెడ్డి, మనోహర్, షాజహాన్, దిలీప్, అహ్మద్, నయాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

జేసీని కలిసిన ఏపీఆర్‌ఎస్ నేతలు

నెల్లూరు(అర్బన్): నూతన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లును ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా కార్యవర్గ సంఘ నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రెవెన్యూ అసోసియేషన్ తరఫున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు అల్లంపాటి పెంచలరెడ్డి, యడ్ల నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఆర్‌ఎస్‌ఏ కార్యవర్గ సభ్యులైన పలువురు తహసీల్దార్లు, డీటీలు, ఉద్యోగులు వెంకటేష్, ఆనంద్, కృష్ణ, ప్రసాద్, డానియేల్ పీటర్‌రావు, హేమంత్‌కుమార్, శాంతికుమారి, శ్రీకాంత్‌రెడ్డి, రాహుల్, శేషయ్య, నాజర్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

➡ జిల్లా రిటైర్డ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముత్యం నరసింహులు ఆధ్వర్యంలో పలువురు నేతలు జేసీని కలిశారు. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్లు డీవీ సుధాకర్, జనార్దన్, రామలింగేశ్వరరావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



జేసీని సన్మానిస్తున్న ఏపీఆర్‌ఎస్‌ఏ నాయకులు

మర్యాదపూర్వకంగా..

కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఏపీజీఈఏ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కోశాధికారి సురేష్, నాయకులు కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, శశికుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

➡ గతంలో ప్రభుత్వాస్పత్రిలో కేన్సర్ బాధితులకు ఇస్తున్న మందులను పూర్తిస్థాయిలో మరలా అందుబాటులో ఉంచాలని జనసేన నేత గునుకుల కిశోర్ కలెక్టర్ హిమాన్షు శుక్లాను కోరారు.

పీఎఫ్ వివరాలు అప్‌డేట్ చేయండి

నెల్లూరు(పొగతోట): ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేసి స్లిప్‌లను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. మంగళవారం వారు జెడ్పీ సమావేశ మందిరంలో సీఈఓ మోహన్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రియాజ్, కృష్ణారెడ్డి, అలీ, సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నెల్లూరు(బారకాసు): పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ వైఓ నందన్ తెలిపారు. ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం సమావేశ మందిరంలో మంగళవారం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో వారాంతపు సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని ప్రతి ఇల్లు, ఖాళీ స్థలం పన్ను పరిధిలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్వో వాసుబాబు, రెవెన్యూ ఆఫీసర్లు సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నా చుట్టూ తిరిగితే పదవులు రావు

➡ మంత్రి నారాయణ

నెల్లూరు సిటీ: 'క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే పదవులొస్తాయి. నా చుట్టూ తిరిగితే రావు' అని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరులోని మెడికల్ కళాశాలలో ఉన్న క్యాంపు కార్యాలయంలో మంగళవారం నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మవరపు సుబ్బారావు, విజయభాస్కర్‌రెడ్డి, తాళ్లపాక అనూరాధ, విజేతారెడ్డి పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

నెల్లూరు(అర్బన్): జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మంగళవారం రాయాజీవీధిలో ఉన్న వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. శ్రీధన్వంతరి కేరళ ఆయుర్ కేర్ డాక్టర్లు వాత్సవ కుమార్, శ్రీకర్ భరద్వాజ్ రోగులను పరీక్షించి రూ.50 వేల విలువైన మందులను పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం

నెల్లూరు(బారకాసు): ఎల్టీపీల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం నుడా కార్యాలయంలో ఎల్టీపీలు, బిల్డర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకునేలా ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. నుడా సెక్రటరీ అల్లంపాటి పెంచలరెడ్డి, పీఓ హిమబిందు పాల్గొన్నారు.